## దివ్యాంగులకు యంత్రాలు పంపిణీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4: కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని డివిజన్ రిసోర్స్ సెంటర్‌లోని విలీన విద్యా వనరుల కేంద్రంలో విద్యార్థులకు అలింకో, తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు రోలేటర్, వినికిడి యంత్రాలను శుక్రవారం అందించారు. మండల విద్యాధికారి ప్రభాకర్ చేతుల మీదుగా దివ్యాంగులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు సతీశ్, స్వరూప, దివ్యాంగ విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

శ్రీరాంపూర్, ఏప్రిల్ 4 : నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ప్రెస్‌క్లబ్ గౌరవ కార్యదర్శి సీహెచ్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడిగా భాస్కర్ల రాజేశం , అధ్యక్షుడిగా భూపతి రవి, ప్రధాన కార్యదర్శిగా కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మైదం రామకృష్ణ, సీపతి రాములు, సంయుక్త కార్యదర్శిగా వేల్పుల మల్లేశం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా క్యాతం రాజేశ్, ఫైనాన్స్ మేనేజర్‌గా నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా తలారి సమ్మయ్య, ప్రెస్‌క్లబ్ క్రమశిక్షణ సంఘం కన్వీనర్‌గా కోడం రవికుమార్‌లు ఎన్నికయ్యారు.

## ఆరుగురు ఎస్‌ఐలు బదిలీ

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 4 : జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మల్టీజోన్ 1 హైదరాబాద్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన వారిలో జీ సురేశ్ ఎస్‌హెచ్‌వో హాజీపూర్ నుంచి ఎస్‌హెచ్‌వో లక్షెట్టిపేటకు, పీ సతీశ్ ఎస్‌హెచ్‌వో లక్షెట్టిపేట నుంచి వీఆర్‌కు, కేబీఎం ఆసిఫాబాద్, ఎన్ స్వరూప్‌రాజ్ వీఆర్ రామగుండం నుంచి ఎస్‌హెచ్‌వో హాజీపూర్‌కు, యూ ఉపేందర్‌రావు టాస్క్‌ఫోర్స్ రామగుండం నుంచి ఎస్‌ఐ 2 మంచిర్యాల టౌన్‌కు, బీ వినీత ఎస్‌ఐ 2 మంచిర్యాల టౌన్ నుంచి సీసీఆర్‌బీ రామగుండంకు, వీ రమాలక్ష్మి ఎస్‌ఐ 3 గోదావరిఖని టూ టౌన్ నుంచి ఎస్ 2 జైపూర్‌కు బదిలీ అయ్యారని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## అర్హులందరికీ సన్నబియ్యం అందాలి

నస్పూర్, ఏప్రిల్ 4 : అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని రేషన్ దుకణాల ద్వారా సన్న బియ్యం పంపిణీని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఇక్కడ అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులున్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

దండేపల్లి, ఏప్రిల్ 4: దండేపల్లి మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ముత్తినేని మొండయ్య (42) గతనెల 29న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా శుక్రవారం మృతి చెందాడు. దండేపల్లి ఎస్ తహసినొద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మొండయ్య భార్య రెండు నెలల క్రితం అతనిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై, జీవితంపై విరక్తితో గతనెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సమీపంలోని దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మొండయ్య మేనమామ రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కాసిపేటలో మహిళ ..

కాసిపేట, ఏప్రిల్ 4 : మండలంలోని పెద్దనపల్లి నాయకపుగూడకు చెందిన మహిళ మేసినేని మల్లు (53) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందని కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు, మల్లు ముఖంపై పుండు లాంటి గాయమైందని, పుండు ఎంతకు తగ్గలేదు. నొప్పి తట్టుకోలేక రోజూ ఏడుసూ, మద్యానికి అలవాటు పడిందన్నారు. ఈనెల 2న ఇంట్లో గుర్తుతెలియని మందు తాగి వాంతులు చేసుకుంటుండగా ఇంట్లో వాళ్లు గమనించి బెల్లంపల్లి దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషయం గా ఉండడంతో వరంగల్ హాస్పిటల్‌కు తరలించారు. వరంగల్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టోకెన్ సమ్మెను విజయవంతం చేయండి

జైపూర్, ఏప్రిల్ 4: మే 20న నిర్వహించే ఒక్కరోజు టోకెన్‌సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు కమిటీ శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారంఖని 1ఏ గనిపై ఉదయం షిఫ్టులో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న దేశవ్యాప్తంలో సమ్మెలో భాగంగా సింగరేణిలో కూడా ఒక్కరోజు సమ్మె జరుగుతుందని తెలిపారు. కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఇక్కడ బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, బ్రాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, బెల్లంపల్లి రిజియన్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు, కార్యదర్శులు నవీన్‌రెడ్డి, అగ్గు శ్రీకాంత్, మైనింగ్‌స్టాఫ్ బ్రాంచ్ కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు అడ్డు శ్రీనివాస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌కాన్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

జన్నారం, ఏప్రిల్ 4 : మండలంలోని కలమడుగు గ్రామ సమీపంలోని కోళ్ల ఫారంలో పేక ఆడుతున్న తొమ్మిది మందిని సిబ్బందితో కలిసి పట్టుకున్నామని ఎస్‌ఐ రాజవర్ధన్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి తమకు అందిన సమాచారం పక్కా సమాచారం మేరకకు కోళ్ల ఫారం వద్దకు వెళ్లి తనిఖీ చేయగా పేక అడుతున్న గంజి వెంకటేశ్(రేవోజీపేట), కొంపెల్లి నర్సయ్య, బందెల శంకర్, మతులాపురం కృష్ణ, తిర్రి శ్రీనివాస్ గౌడ్, శ్రీరాముల రాజేశం, పోతుగంటి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, మహ్మద్ అబ్దుల్ యాసిన్‌ను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.2వేలు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

## జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4: మాదకద్రవ్యాల రవాణాపై జిల్లాలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సంబంధిత అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణాపై జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4: ప్రతి ప్రధానోపాధ్యాయుడు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ పరిశీలకుడు స్టాలిన్ బాబు అన్నారు. ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన పీజీ, ప్రైమరీ హెచ్‌ఎంలు, సాంఘీక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాఠశాల అవసరాలు తీర్చేలా తగిన విధంగా విజన్ మిషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్స్ సత్యనారాయణ, అనురాధ, ఎంఎల్ రాజు, శైలజ, లాలాజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

కాసిపేట, ఏప్రిల్ 4 : మందమర్రి ఏరియాలోని కల్యాణిఖని ఓపెన్ కాస్ట్ నిర్వాసిత గ్రామస్తుల సమస్యలను పరిష్కరిస్తామని సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. శుక్రవారం కాసిపేట మండలంలోని ఓసీ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెంలో జీఎం దేవేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను జీఎంకు వివరించారు. కార్యక్రమంలో సింగరేణి సివిల్ ఎస్‌ఈ రాము, ఈఈ జే ప్రకాశ్, ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, గ్రామస్తులు బూర్గుపల్లి రమేశ్, దుర్గం శ్రీనివాస్, నాగపూరి శ్రీనివాస్, శాకర్‌మాన్ మహేందర్, ఊట్ల విజయలక్ష్మీ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రత్యేక వైద్యులను నియమించాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 : వంద పడకల దవాఖానలో ప్రత్యేక వైద్య నిపుణులను నియమించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ కోరారు. శుక్రవారం దవాఖాన సూపరింటెండెంట్ కిరణ్‌కుమారికి వినతిపత్రం సమర్పించారు. దవాఖానలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదని ఆరోపించారు. దవాఖాన సమస్యలపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ చొరవ చూపాలని కోరారు.

## పెండింగ్ డీఏ విడుదల చేయాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 4:రాష్ట్రంలోని పెండింగ్ డీఏ వెంటనే విడుదల చేయాలని సినియర్ సిటిజన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ప్రతినిధులు నారాయణ, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్, లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఏలు చెల్లించకపోవడంతో సామాన్య ఉద్యోగులు, పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే డీఏలు విడుదల చేయాలని కోరారు.

## నేర ప్రవృత్తిని మార్చుకోవాలి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 4: నేర ప్రవర్తనను మార్చుకొని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ రౌడీ షీటర్లకు సూచించారు. శుక్రవారం మంచిర్యాలకు చెందిన పలువురు రౌడీ షీటర్లకు జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ముత్తే ప్రవీణ్ ఉన్నారు.

## ప్రతి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4: జిల్లాలోని అర్హత గల ప్రతి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని పాడిబండ గ్రామంలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పోలీసులకు సన్మానం

జన్నారం, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొంది, బదిలీపై వెళ్తున్న కే భాస్కర్, పీ సురేశ్‌ను స్థానిక ఎస్‌ఐ రాజవర్ధన్, సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బుద్ధ ఉత్సవ కమిటీ ఎన్నిక

కౌటాల, ఏప్రిల్ 4 : సిర్పూర్ తాలూక గౌతమ బుద్ధ ఉత్సవ కమిటీని సిర్పూర్ (టీ) మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడుగా దుర్గం విక్రం, ఉపాధ్యక్షుడిగా దుర్గం జనార్దన్, కమిటీ సభ్యులుగా శివారం, నవీన్, తిరుపతి, రాజారం, సూరజ్, ప్రేంనంద్‌తోపాటు పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## తహసీల్దార్‌కు వినతి

కౌటాల, ఏప్రిల్ 4: బీహార్ రాష్ట్రంలోని మహా బోధి మహా విహార్‌ను ఇతరుల నుంచి బౌద్ధులకు అప్పగించాలని కోరుతు నియోజక వర్గంలోని బౌద్ధులు సిర్పూర్ అంబేద్కర్ భవన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. అనంతరం అంబేద్కర్ భవన్‌లో డాక్టర్ భీంరావు అంబేద్కర్–మాత రమాబాయిల 119వ పెళ్లిరోజు సందర్భంగా కేకు కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు బసార్కర్ విశ్వనాథ్, రత్నం శ్రీకాంత్, రాజు, నాందేవ్, తిరుపతి, దేవీదాస్, తులసీరాంతో పాటు నియోజక వర్గ బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

# మైనారిటీ శాఖ జిల్లా అధికారిగా నదీమ్

- **ప్రస్తుతం ఉన్నవారిని మార్చడంపై పలు అనుమానాలు**
- **అన్వరులకు పట్టం కట్టడం కోసమేనా ?**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా మైనారిటీ శాఖ జిల్లా అధికారిగా అబ్దుల్ నదీమ్ ఖుద్దూసీని నియమిస్తూ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో హార్టికల్చర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు డీటీడీవో రమాదేవి నుంచి జిల్లా మైనార్టీ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను తీసుకోనున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పూర్తి అదనపు బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిగా ఉన్న రమాదేవిని తప్పించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మైనార్టీ గురుకులాల్లో చేపట్టిన నియామకాల్లో అక్రమంగా అన్వరులకు పోస్టింగ్ ఇస్తున్నారని పలువురు బాధితులు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. బాధితులకు న్యాయం జరుగుతుందని ఎదురు చూస్తున్న క్రమంలో అధికారినే మార్చేయడంపై సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన నియామకాల్లో అర్హులకు పోస్టింగ్ ఇచ్చేలా తన వంతు ప్రయత్నం చేస్తూ అన్వరుడికి పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వకుండా అడ్డుకుంటుందనే ఆమెను పక్కన పెడుతున్నారని గుసుగుసలు వినబడుతున్నాయి. సదరు అధికారిని గతంలో అప్పటి కలెక్టర్ హేమంత్ బోర్ఖడే సహకారంతో ఈ శాఖలో ఔట్ సోర్సింగ్ ప్రిన్సిపల్‌ను తొలగించి రెగ్యులర్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌లను నియమించడంలో కీలకపాత్ర పోషించారు. కాగా ఈ మార్పు అన్వరులకు పట్టం కట్టడం కొరకే జరుగుతుందేమోనని విద్యా శాఖకు సంబధం లేని ఉద్యానవన శాఖ అధికారికి ఇన్‌చార్జి ఇవ్వడంపై విమర్శలకు దారితీస్తుంది.

# గుప్తనిధుల కోసం తవ్వకాలు

- **నలుగురు నిందితుల అరెస్టు**

వేమనపల్లి, ఏప్రిల్ 4 : మండలంలోని రాజారాం గ్రామంలో గురువారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన నలుగురిని అరెస్టు చేశామని నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, రాజారాం గ్రామానికి చెందిన జమ్మి మల్లయ్య, బెల్లంపల్లికి చెందిన ముత్యం మధు, కరీంనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ నల్లకుమార్, బెజ్జూరు మండలం ముంజంపల్లికి చెందిన బారెపల్లి సుధాకర్ కలిసి మండలంలోని రాజారాం గ్రామంలో గురువారం రాత్రి జమ్మి మల్లయ్య పెరట్లో గుప్తనిధుల కోసం గుంత తవ్వగా ఎలాంటి నిధి లభ్యం కాలేదు. స్థానికుల సమాచారంతో నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్ పటేల్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిధుల కోసం తవ్విన గుంతను పరిశీలించారు. గుంతలో కొబ్బరికాయలు, నిమ్మకాలు ఉండడంతో నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు.



గుప్తనిధుల కోసం తవ్విన గుంత

## నిమ్స్ రెండో అంతస్తు నుంచి దూకిన బెల్లంపల్లివాసి

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 : హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖాన భవనం రెండో అంతస్తు నుంచి శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీకి చెందిన హన్మాండ్ల నారాయణ (52) దూకడం కలకలం రేపింది. నారాయణ తండ్రి పోశం (80) కొంత కాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బెల్లంపల్లి, మంచిర్యాల, వరంగల్ ఎంజీఎం దవాఖానల్లో చూపించిన నయం కాలేదు. మూడురోజుల కితం పోశంను నిమ్స్ దవాఖానలో చేర్పించారు. మరో కుమారుడు మధూకర్ తండ్రి పోశంను రెండో అంతస్తులో ఉన్న వైద్యునికి వద్దకు తీసుకెళ్లాడు. దీంతో అదే అంతస్తులో ఉన్న నారాయణ ఒక్కసారిగా భవనంపై నుంచి దూకాడు. దీంతో తలకు, ఇతర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. ఎందుకు దూకాడో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

# పాలేరు కుటుంబానికి న్యాయం చేయాలి

- **ఆదివాసీ గిరిజన సంఘం, బంధువుల ధర్నా**



రోడ్డుపై ధర్నాచేస్తున్న మృతుని కుటుంబీకులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వేమనపల్లి, ఏప్రిల్ 4 : మంగెనపల్లి గ్రామానికి చెందిన పాలేరు నాయిని కన్నయ్య (35) మృతికి కారణమైన ఎనగంటి చిన్నన్న, అతని భార్య లక్ష్మీపై కఠిన చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని కన్నయ్య కుటుంబీకులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నయ్య కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని మంగెనపల్లికి చెందిన కన్నయ్య గ్రామంలోని ఎనగంటి చిన్నన్న వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం కన్నయ్య అదే గ్రామంలోని చిన్నన్న వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం చిన్నన్న పొలానికి మందు కొట్టే పంపు చెడిపోవడంతో ఎందుకు మరమ్మతులు చేయించలేదని చిన్నన్న, అతని భార్య లక్ష్మీ కన్నయ్యను దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన కన్నయ్య వారి ముందే పురుగుల మందు తాగి కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించగా కుటుంబీకులు అక్కడకు చేరుకుని కన్నయ్యను వైద్యం కోసం ఆటోలో చెన్నూరులోని దవాఖానకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబీకులు, ఆదివాసీ సంఘం నాయకులు వేమనపల్లికి చేరుకుని రోడ్డుపై ధర్నా చేశారు. కన్నయ్య మృతికి కారణమైన చిన్నన్న, అతని భార్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ, మృతుని కుటుంబానికి ప్రభుత్వం మూడు ఎకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ విషయంపై నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్ పటేల్‌ను వివరణ కోరగా తమకు ఇంత వరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రత్యేక దృష్టి

- **కలెక్టర్ కుమార్ దీపక్**

కాసిపేట, ఏప్రిల్ 4 : విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన అందిస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండలం దేవాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఆవరణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఓరియంట్ సిమెంట్ కంపెనీ హెచ్‌ఆర్ జీఎం కులకర్ణితో కలిసి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. సీఎస్‌ఆర్ నిధులతో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన సీసీ రోడ్డును బెల్లంప ల్లి ఎమ్మెల్యే, ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో మెగా వైద్య శిబిరానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా వయోజన విద్యాధికారి ఏ పురుషోత్తం నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమశాఖాధికారి రౌఫ్‌ఖాన్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రమణతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో శేఖ్ సఫ్దర్ అలీ, మెడిలైఫ్ ప్రత్యేక వైద్య నిపుణులు కమటం కుమార స్వామి, డీఆర్పీ బండ శాంకరీ, మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, భారతాని సతీశ్, ఏపీఎం వెంకటేశ్వర్లు, కార్యదర్శులు కవిత, మేఘన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చెన్నూర్, ఏప్రిల్ 4: చెన్నూర్ పట్టణంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం నూతనంగా 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించటానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఏడీఈ డీ బాలకృష్ణ తెలిపారు. ఇక్కడ ఏఈ శ్రీనివాస్, ఎల్‌ఎం రమేశ్, వినియోగదారులున్నారు.

## ఎస్టీపీపీ ఈడీగా చిరంజీవి

జైపూర్, ఏప్రిల్ 4: ఎస్టీపీపీ ఈడీగా (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) చెన్నకేశవుల చిరంజీవిని నియమిస్తూ సింగరేణి సీఎండీ బలరాం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నార్త్ ఖరంపుర ఎన్టీపీసీలో ఏజీఎం ఓఅండ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవిని డిప్యుటేషన్‌పై ఎస్టీపీపీ ఈడీగా నియమించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాలు అందజేశారు.

## సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం, ఏప్రిల్ 4 : ప్రభుత్వం అందించే సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెండు రేషన్ షాపుల్లో సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. డీలర్లు బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామెర కవిత, కార్యదర్శి ప్రణిత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



నాటిన మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ప్రత్యేకాధికారి ప్రకాశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతి వర్షపు నీటిబొట్టును వృథా చేయకుండా పొదుపుగా వాడుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. శుక్రవారం మండలంలోని చిర్రకుంట వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలోని పాడిబండ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ–వాటర్ షెడ్ ప్రత్యేక అధికారి ప్రకాశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో వాటర్ షెడ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ రోహిత్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వాటర్‌షెడ్ అధికారి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 4: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కమిషనర్ శివాజీకి జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎండకాలం దృష్ట్యా పనివేళలను మధ్యాహ్నం 12 గంటల వరకు తగ్గించాలని, కార్మికులకు ప్రతి సంవత్సరం లాగే బట్టలు, చెప్పులు, గ్లౌజులు ఇప్పించాలని, ప్రతి కార్మికుడికీ కార్పొరేషన్ నుంచి ఐడీకార్డు అందించాలని, డ్రైవర్లను పాత పద్ధతిలోనే వారి స్థానాల్లో పంపించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐలకు సంబంధించిన డబ్బులు కార్మికుల జీతాల నుంచి కోత పడుతున్నా వాటి అకౌంట్లలో జమ కావడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, ఆవునూరి లింగయ్య, చిప్పకుర్తి లింగయ్య, ఆవుల శ్రీనివాస్, శ్యాంకుమార్, రాయలింగు, మొగిలి, ఓదెలు, మల్లయ్య, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

# క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నస్పూర్, ఏప్రిల్ 4 : మిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని మిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో గూగుల్, పేటీఎం, టాటా స్ట్రివ్, ఎల్ఐసీ, మారుతి సుజుకీ, మెడ్‌ప్లస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఆక్సిస్ బ్యాంకుల వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఇందులో 310 మంది గ్రాడ్యుయేట్‌లు, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ రౌండ్లు నిర్వహించారు. మొత్తం 94 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఉపేందర్‌రెడ్డి, కరెస్పాండెంట్ శ్రీనివాసరాజు తెలిపారు. ఇక్కడ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దీపాబారాజు, ఇన్‌చార్జి శ్వేత, రోహిత్,గోపికృష్ణ, అధ్యాపకులు, సంస్థల ప్రతినిధులున్నారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పువ్వు ఇచ్చి అభినందిస్తున్న ఎస్‌ఐ

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 4: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రాజశేఖర్ సూచించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్లై ఓవర్ బ్రిడ్జి చౌరస్తాలో ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుందని, ప్రతి వాహనచోదకుడు జాగ్రత్తగా తమ వాహనాన్ని నడపాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న కొందరికి ఎస్‌ఐ రాజశేఖర్ గులాబీ పువ్వులు ఇచ్చి అభినందించారు. ఇక్కడ రెండో ఎస్‌ఐ లలిత, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లున్నారు.

## సమష్టి కృషితోనే లక్ష సాధన



ఖైరగూడ ఓసీపీ లో కార్మికులకు స్వీట్లు అందిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, ఏప్రిల్ 4: 2024–2025 ఆర్థిక సంవత్సరంలో వందశాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించడంలో ప్రతి ఒక్క ఉద్యోగి కృషి ఉందని, సమష్టి కృషి తోనే అది సాధ్యమైందని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేసారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరగూడ ఓసీపీలో శుక్రవారం మార్చిలో వందశాతం ఉత్పత్తి సాధించి స్పెషల్ ఇన్సెంటివ్ స్కీంకి అర్హత సాధించినందుకు కార్మికులందరికీ మిఠాయి పంపిణీ చేశారు. అనంతరం కార్మికులు, సూపర్‌వైజర్లకు గొడుగులు, తెల్లటి చేతి రుమాలు అందించారు. కార్యక్రమంలో ఖైరగూడ ఓసీపీ పీవో మచ్చగిరి నరేందర్, పీఈ వీరన్న, మేనేజర్ శంకర్, సేఫ్టీ ఆఫీసర్ నారాయణ, డీవైపీఎం వేణు, సంక్షేమాధికారి రజనీకుమార్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, నాయకులు శేషు, మాల ఓదేలు, మీసా చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మా భూముల్లో రోడ్డు వేయొద్దు

బెజ్జూర్, ఏప్రిల్ 4 : మండలంలోని రెబ్బెన గ్రామ శివారులో తమ సాగు భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణాలు వేయొద్దని బాధిత రైతులు అన్నారు. లేకపోతే రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ భీమ్లానాయక్, కాగజ్‌నగర్ ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీ నారాయణకు వినపతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎల్కటూరి శంకరయ్య, మామిడి పల్లి మధునయ్య, మామిడిపల్లి తిరుపతి, మామిడిపల్లి హరీశ్, సిద్దల జానకి, బాపు తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 4 : మోటార్ సైకిల్ దొంగతనం కేసులో చెన్నూర్ పట్టణ పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన ముస్కే జగదీశ్ (22)ను అరెస్ట్ చేశారు. చెన్నూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సుబ్బారావుతో కలిసి సీఐ దేవేందర్ రావు వివరాలు వెల్లడించారు. తమ మోటర్ సైకిళ్లు పోయాయని ఎండీ ఖాజా ఇమ్రోస్, చల్లా సుధాకర్ రెడ్డిలు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సుబ్బారావు రెండు కేసులు నమోదు చేశారు. సీఐ దేవేందర్ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి ఎస్‌ఐ సుబ్బారావు ఏప్రిల్ 4న శుక్రవారం చెన్నూర్ బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీల్లో నిందితుడు మోటర్ సైకిల్‌తో పట్టుబడ్డాడు. అనంతరం నిందితుడి వద్ద నుంచి మూడు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ దేవేందర్ రావు తెపారు. కేసును ఛేదించిన సీఐ డీ దేవేందర్ రావు, ఎస్‌ఐ సుబ్బారావును ఉన్నతాధికారులు అభినందించారు.

## సన్నబియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు



చేడువాయిలో లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పెంచికల్ పేట్, ఏప్రిల్ 2 : ప్రభుత్వం ప్రజల కోసం ఉచితంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యాన్ని డీలర్లు, దళారులు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బొంబాయిగూడ, చెడువాయి, దరోగపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, పంచాయతీ ప్రత్యేకాధికారి అబ్దుల్ ఖదీర్, ఆర్ఐ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి జయశ్రీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 4 : కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ టింబర్ యార్డును సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే టింబర్ యార్డు కార్మికులకు సర్వీసు, సీఎంపీఎఫ్ పెన్షన్, జీతాల పెరుగుదల పొందుతారని చెప్పారు. రిటైర్డ్ కార్మికులు కూడా సర్వీస్ డబ్బులు, ప్రమోషన్లలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. 35 ఏండ్లుగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల వైఖరి వల్ల తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఆర్జీ–1 కార్యదర్శి పల్లె క్రాంతికుమార్, కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT ASIFABAD**
**S.O.P No. 02 OF 2025**

BETWEEN:
Debbati Thara @ Tara and others ....Petitioners
AND
**The Singareni Collieries Company Limited,** and others, Whom So Ever Concern .....Respondents

To
**Whom So Ever Concern**

Take notice that the above S.O.P is filed by the petitioners for grant of the succession certificate, with regard to the death benefits of Late Debbati Bapu, lying with **The Singareni Collieries Company Limited**, who is the respondents No.1 to 3 herein and the case is posted to 10-04-2025 for appearance of any person having any claim or say in the above matter, fail to appear in the above said court on the above said day at 10-30 AM, in person or through Advocate, then the case will be decided as per law.

// BY ORDER OF THE COURT //

Sd/- **G.GANAPATHI,** Advocate
(counsel for Petitioners)
Komarambhim Asifabad. Cell: 9441736527